# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రోజ్ గార్ మేళాలో 51వేల మంది యువతకు నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పంపిణీ చేశారు.

- దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి ద్వారానే వికసిత్ భారత్ దార్శనికత సాకారమవుతుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు.

- ఆయుర్వేదాన్ని నేడు ప్రపంచం మొత్తం ఆదరిస్తోందని ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు.

- ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ తొలి ఇన్నింగ్స్ లో ఈరోజు టీ విరామ సమయానికి 5 వికెట్లు నష్టపోయి 316 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కొత్తగా నియమితులైన యువతకు 16వ రోజ్ గార్ మేళాలో 51వేలకు పైగా నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ విధానంలో ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన రోజ్‌గార్ మేళా చొరవతో లక్షలాది మంది యువత ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో శాశ్వత ఉద్యోగాలు పొందారని, వారు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ రంగంలో నూతన ఉపాధి అవకాశాలను సృష్టించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, తయారీ రంగంలో పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయని పేర్కొన్నారు. నేడు ప్రపంచ బ్యాంకు వంటి ప్రధాన సంస్థలు భారతదేశాన్ని ప్రశంసిస్తున్నాయని నరేంద్రమోదీ మాట్లాడుతూ..

(వాయిస్ బైట్...45 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి ద్వారానే ప్రధానమంత్రి వికసిత్ భారత్ దార్శనికత సాకారమవుతుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు కేరళ తిరువనంతపురంలోని పుత్తారికాండం మైదానంలో జరిగిన బిజెపి నాయకత్వ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవినీతి రహిత పాలన, ప్రభుత్వ పథకాలలో ప్రజలకు సమాన అవకాశం, రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా అభివృద్ధి.. కేరళ వృద్ధికి ముఖ్యమైనవిగా ప్రధానమంత్రి భావిస్తున్నారని తెలిపారు. వికసిత్ కేరళం, వికసిత్ భారత్‌లో అంతర్భాగమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ బైట్...40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుర్వేదానికి నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు. ఈరోజు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద (ITRA) - తొలి స్నాతకోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రాచీన వైద్య వ్యవస్థను ప్రోత్సహించడంలో ఈ సంస్థకు ముఖ్యమైన పాత్ర ఉందని ఆయన తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...18 సెకన్లు)

===========================

ఢిల్లీలోని సీలంపూర్ జనతా కాలనీలో ఈరోజు ఉదయం నాలుగు అంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి చెందారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. శిధిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, పౌర రక్షణ సిబ్బంది సంఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఢిల్లీ ఈశాన్య జిల్లా అదనపు డీసీపీ సందీప్ లాంబా తెలిపారు.

===========================

విరామం

===========================

అహ్మదాబాద్ లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (AAIB) తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. విశాఖపట్టణంలో ఈరోజు పర్యటించిన ఆయన అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ కేసులో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయని, ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది భారతదేశంలో ఉన్నారని కే.రామ్మోహన నాయుడు తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===========================

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఈరోజు 9 మంది మహిళలు సహ 23 మంది మావోయిస్టులు పోలీసుల వద్ద లొంగిపోయారు. ఈ మావోయిస్టులపై మొత్తం 1 కోటి 18 లక్షల రూపాయల రివార్డు ఉందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరికి ప్రోత్సాహక మొత్తంగా యాభై వేల రూపాయల నగదుని, రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం కింద ఇతర సౌకర్యాలను అందిస్తామని చెప్పారు.

===========================

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన వల్సాద్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి తరువాత ముంబై, వడోదరలో డివిజనల్ ట్రాక్ ఇంజనీర్ , డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వంటి వివిధ కీలక పదవులను నిర్వహించారు. ఆ తరువాత ఆర్.డి.ఎస్.ఓలో ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పని చేసి అధునాతన రైలు సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో ఎంతగానో దోహదపడ్డారు.

===========================

ఛత్రపతి శివాజీ మహారాజ్ కు చెందిన 12 చారిత్రాత్మక కోటలను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడం పట్ల కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి పియూష్ గోయల్ మహారాష్ట్ర ప్రజలను అభినందించారు. ముంబైలోని దాదర్‌లోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉద్యాన్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ కోటలు ప్రపంచ గుర్తింపు, గర్వానికి ప్రతీక అని అన్నారు. వీటిని ఈ జాబితాలో చేర్చడం వల్ల వాటి చారిత్రక సాంస్కృతిక ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని పియూష్ గోయల్ పేర్కొంటూ..

(వాయిస్ బైట్.. 26 సెకన్లు)

===========================

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా లండన్ లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో భారత్ టీ విరామ సమయానికి 5 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఇంకా 71 పరుగులు వెనుకబడి ఉంది. భారత ఓపెనర్ కె.ఎల్.రాహుల్ ఈ ఇన్నింగ్స్‌లో తన పదవ శతకాన్ని నమోదు చేశాడు.

===========================

లండన్ లో వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ ఫైనల్ మ్యాచ్ కొద్దిసేపటి క్రితం సెంట్రల్ కోర్టులో ప్రారంభమైంది. మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికాకు చెందిన అమండా అనిసిమోవా, పోలాండ్ కు చెందిన ఇగాస్వియాటెక్ ఈ ఫైనల్ మ్యాచ్ లో వింబుల్డన్ 2025 టైటిల్ కోసం పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా.. పురుషుల సింగిల్స్ విభాగంలో జానిక్ సినర్, కార్లోస్ అల్కరాజ్ ల మధ్య ఫైనల్ మ్యాచ్ రేపు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో రాబోయే 5 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమ హిమాలయ ప్రాంతం, మైదానాల్లోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 7 రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు మరింత బలపడ్డాయని, వాతావరణ శాఖ జూలై 18 వరకు ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరిలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఉంటాయని భారత వాతావరణ శాఖ ఐఎమ్‌డి వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =